జగన్ పర్యటన విజయవంతానికి మంత్రి రోజా కృషి

- భారీ బందోబస్తు ఏర్పాటు

విశాలాంధ్ర -పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గంలో జగన్ పర్యటన విజయ వంతానికి కృషి చేస్తున్నామని మంత్రి ఆర్కె రోజా అన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వైసీపీ నాయకులు సీఎం జగన్ నగరి పర్యటనను విజయవంతం చెయ్యాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 28వ తేదీ సోమవారం సీఎం వైఎస్ జగన్ నగరి పర్యటనకు వస్తున్న సందర్భంగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సీఎం జగన్ బహిరంగ సభకు వైసీపీ కార్యకర్తలను భారీ సంఖ్యలో తరలించడానికి ఆ పార్టీకి చెందిన నాయకులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. నగరి ఎమ్మెల్యే, మంత్రి రోజా కూడా కార్యకర్తల సమీకరణ కోసం తన అనుచరులను రంగంలోకి దింపారు. నగరి పట్టణ శివార్లలోని సాయి దివ్యధామంలో సీఎం జగన్ బహిరంగ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరి పట్టణ సమీపంలోని కీళ్లపట్టు వద్ద హెలిపాడ్ సిద్ధం చేశారు. కీళ్లపట్టు హెలిపాడ్ నుంచి సీఎం జగన్ రోడ్ షో నిర్వహించి నగరి పట్టణంలోని పళ్లిపట్టు రోడ్డు, ప్రకాశం రోడ్డు మీదుగా నగరి బైపాస్ రోడ్డు మీద జగన్ రోడ్డు బహిరంగ సభకు చేరుకునేలా వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం జగన్ దిగనున్న హెలిపాడ్ నుంచి రోడ్ షో జరిగే రోడ్లు, బహిరంగ సభ జరిగే ప్రాంతం వరకు రోడ్లకు ఇరు వైపుల పోలీసులు భారీ ఎత్తున బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం నగరిలో జరిగనున్న సీఎం జగన్ బహిరంగ సభకు వైస్ సీపీ కార్యకర్తలు భారీగా తరలివస్తారని ఆ పార్టీకి చెందిన నాయకులు అంచనావేస్తున్నారు.సీఎం జగన్ భారీ బహిరంగ సభ జరిగే ప్రాంతంలో అత్యవసర వైద్యసేవలు అందించడానికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యకర్తలకు మంచినీళ్లు, ఆహార పొట్లాలు అందుబాటులో ఉండటానికి నగరి వైసీపీ కార్యకర్తలు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. మంత్రిగా రోజా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ నియోజక వర్గంలో సీఎం జగన్ మొదటిసారి పర్యటిస్తున్నారు. శనివారం సాయంకాలం 6 గంటలకు నగరి పట్టణంలో ఒక మాదిరి వర్షం పడడం కూడా మా నాయకుడు జగన్కు ఆహ్వానం శుభసూచకమని మంత్రి రోజా పేర్కొన్నారు. ఆదివారం కూడా అధికారులు పోలీసు యంత్రాంగం సీఎం పర్యటన సందర్భంగా కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని మంత్రి రోజా తెలిపారు సీఎం జగన్ బహిరంగ సభను విజయవంతం చేసి ఆయన దగ్గర మంచి ప్రశంసలు అందు కోవాలని మంత్రి రోజా గట్టిగానే శ్రమిస్తున్నారు.

సీనియర్ నేత సీఆర్‌రాజన్‌కు అభినందన వెల్లువలు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుచానూరు మాజీ సర్పంచ్, సినీనిర్మాత, వన్నెకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కోశాధికారి, సి.ఆర్.రాజన్ టిడిపి లో చేరిన శుభ సందర్భంగా వారి నివాసం వద్ద ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. తిరుచానూరు,తిరుపతి,చిత్తూరు,శ్రీకాళహస్తి,నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా సత్కరించి స్వీట్స్ తినిపించుకుని అభినందనలు వెల్లువెత్తాయి.ఈ సందర్భంగా తిరుపతి రూరల్ టిడిపి మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ నాయకులతో కలిసి గజమాలతో సత్కరించారు.టిడిపి నాయకులు అలిమినేని మధు,తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్ రెడ్డి, నాయకులు సల్మాన్ రాజు, మునిరత్నం రెడ్డి,హరి రామ్,కలీం,శివ,సాయి రాయల్ ,వాసు,జీవన్, సురేష్,కలిసి దుశ్శాలవతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.తమ నాయకుడు చేరికతో ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి శ్రేణులో నూతన ఉత్సాహం వెలువిరిసింది.ముఖ్యంగా తిరుచానూరు టిడిపి శ్రేణుల్లో అవధులు లేని ఆనందంతో రాజకీయం రసవత్తరంగా మారుతుందని చెప్పకోవడం విశేషం.

టీపిపి ఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతిలోని టీ పి పి ఎం హై స్కూల్ లో ఆదివారం 1975-1976 మధ్యకాలంలో 10 వ తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమావేశం జరిగింది. ఆనాటి విద్యార్థులు దొరస్వామి రెడ్డి, దుర్గా వరప్రసాద్, వనం గౌరీ శంకర్, ఉదయభాను ల నేతృత్వంలో జరిగిన కార్యక్రమం లో పాల్గొనడానికి స్థానికంగానే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని నాలుగున్నర దశాబ్దాల నాటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల హెడ్ మాస్టర్ ఆనందకుమార్ తో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు మునిరామయ్య, భారతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాము చదివిన స్కూలుకి రూ 10 వేలు విలువైన ఫర్నిచర్ ను విరాళం గా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

సిద్దవటం యానాదయ్యని కలిసిన టిటిడి ఉద్యోగుల సంఘం నాయకులు

విశాలాంధ్ర - తిరుపతి : తిరుమల తిరుపతి దేవ స్థానముల పాలకమండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య ని విజయవాడలోని వారి నివాసం వద్ద కలసి శుభాకాంక్షలు తెలియచేసిన తి.తి.దే ఉద్యోగుల సంఘం నాయకులు వంకీపురం పవన్, కొప్పర్తి శివ,తి.తి.దే కళ్యాణకట్ట సంఘం అధ్యక్షులు కొప్పర్తి వెంకటసుబ్బయ్య (చిన్ని), తిరుపతి నాయీ బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షులు గుండ్లూరు మహేష్ లు కలిసి అభినందించారు.

సెప్టెంబర్ 2న పీఎస్ఎల్వి సి -57 రాకెట్ ప్రయోగం

- సూర్యుడు గుట్టు విప్పడానికి సిద్ధమవుతున్న ఇస్రో
- ఆదిత్య ఎల్ 1 నింగిలోకి

విశాలాంధ్ర -సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట లోని మొదటి ప్రయోగ వేదిక నుండి సెప్టెంబర్ రెండవ తేదీ ఉదయం 11.50 గంటలకు ఆదిత్య యల్‌వన్‌ను పీఎస్ఎల్‌విసి 57 రాకెట్ ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు నింగిలోకి పంపనున్నారు. సౌర వాతావరణాన్ని అధ్యయనం చేయడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అనేక ఇతర యూరోపియన్ స్పేస్, ఆస్ట్రేలియా అంతరిక్ష పరిశోధన సంస్థలతో కలిసి రూపొందిస్తున్న కరోనాగ్రఫీ అంతరిక్షం నౌక. దీన్ని భూమి సూర్యుల వ్యవస్థలోని ఎల్ వన్ బిందు చుట్టూ ఒక హేలో కక్షలో ప్రక్షేపిస్తారు. ఇక్కడ నుండి ఇది సౌర వాతావరణం, సౌర అయస్కాంత తుఫానులను, భూమి పర్యావరణం పై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేస్తుంది. ఈ అంతరిక్ష నౌక కరోనాల్ హీటింగ్, సోలార్ విండ్ యాక్సిలరేషన్, కరోనాల్ మేగ్నొటో మెట్రీ, యువి -సమీప సోలార్ రేడియేషన్‌ను అధ్యయనం చేస్తుంది. ఫోటో స్పియర్, క్రోమోస్పియర్, కరోనా, శౌర్య శక్తి కణాలు, సూర్యుని అయస్కాంత క్షేత్రాన్ని నిరంతరం గమనిస్తుంది. సూర్యున్ని పరిశీలించడానికి ఉద్దేశించిన మొట్టమొదటి భారతీయ మిషన్ ఇది. ఈ ఆదిత్య ఎల్ వన్ ఐదు సంవత్సరాలు పనిచేస్తుంది. అడ్వయిజర్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ 2008 జనవరిలో ఆదిత్య ఆలోచన చేసింది. మొదట్లో దీన్ని సౌర కరోనాను అధ్యయనం చేయడానికి కరోనా గ్రాఫ్ తో భూ కక్షలో ఉండి పనిచేసే చిన్న 400 కేజీలు ఉపగ్రహంగా వుంది. 2016- 2017 ఆర్థిక సంవత్సరానికి మూడు కోట్ల ప్రయోగాత్మక బడ్జెట్ ను కేటాయించారు. అప్పటినుండి ఈ మిషన్ పరిధిని విస్తరించారు. ఇప్పుడు దీనిని లా గ్రాంజ్ పాయింట్ ఎల్ వన్ వద్ద ఉంచి, ఒక సమగ్ర సౌర అంతరిక్ష పర్యావరణ ఆర్బర్ రేట్ రిగా ప్లాన్ చేశారు. అంచేత ఈ మిషన్ కు ఆదిత్య యల్ వన్ అని పేరు పెట్టారు. ఆదిత్య యల్ వన్ మిషన్ ప్రయోగించిన 15 రోజుల తర్వాత, భూమి నుండి దాదాపు 1,500,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ వన్ పాయింట్ వద్ద హేలో కక్షను చేరుకోవడానికి దానికి దాదాపు 109 రోజులు పడుతుంది. 1,500 కేజీల బరువు కరోనాల్ హీటింగ్, సోలార్ విండ్ యాక్సిలరేషన్, కరోనాల్ మాగ్నెటోమెట్రీ, సమీపంలోని యువి సోలార్ రేడియేషన్ పర్యవేక్షణ వంటి విభిన్న లక్షణాలతో ఏడు సైన్స్ పేలోడ్లలను ఈ నౌక నింగిలోకి తీసుకుని వెళ్ళనుంది. ఈ ఆదిత్య యల్ వన్ సూర్యుని ఫొటో స్పియర్, క్రోమోస్పియర్, కరోనాల పరిశీలన చేస్తుంది. అదనంగా ఇందులోని ఒక పరికరము ఎల్ వన్ కక్షగుచేరే సౌర శక్తి కణాల ప్రవాహాన్ని అధ్యయనం చేస్తుంది. మాగ్నోటోమీటర్ పేలోడ్, ఎల్-1 వద్ద ఉన్న హేలో ఆర్బిట్ వద్ద అయస్కాంత క్షేత్ర బలంలో వచ్చే అంతరాలను కొలుస్తుంది. ఈ పేలోడులను భూమి అయస్కాంత క్షేత్రం వల్ల కలిగే అంతరాయాలకి

వెలుపల ఉంచాలి. మొదట ప్రతి పాదించిన విధంగా భూ నిమ్నగ్న కక్ష లో ఉంటే ఈ వీలు ఉండదు. సౌర భౌతిక శాస్త్రంలో పరిష్కారం కానీ ప్రధాన సమస్యల్లో ఒకటి సూర్యుడి దిగువ వాతావరణం కేవలం 6,000 కె, ఉంటే, సూర్యుని ఎగువ వాతా వరణం మాత్రం 1,000,000 కె ఉండడం దానికి తోడు సూర్యుని రేడియే షన్‌ను భూ వాతావరణపు డైన మిక్స్ ను స్వల్పకాలం, దీర్ఘ కాలంలో ఎలా ప్రభావితం చేస్తుందో ఇంకా అర్థం కాలేదు. ఈ మిషన్ సూర్యని వాతా వణంలోని వివిధ పొరల చిత్రాలను దాదాపుగా ఏకకాలంలో సేక రిస్తుంది. ఈ విధంగా ఆదిత్య ఎల్ 1 మిషను సూర్యుని గతిశీల ప్రక్రియల గురించి సమగ్ర అవగాహనను కలిగిస్తుంది. సౌర భౌతిక శాస్త్రం, హీలియో ఫిజిక్స్ లోని కొన్ని అపరిష్కృత సమస్యలను పరిష్కరి స్తుంది. ఈ ప్రయోగానికి సంబంధించి ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోటలో బిజీ బిజీగా ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లు వేగవంతానికి కృషి చేయండి: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరంలో ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్లు వేగవంతానికి కృషి చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల పురోగతి, టి.డి.ఆర్ బాండ్లు పంపిణీపై శనివారం తన ఛాంబర్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టి.డి.ఆర్ బాండ్లు ఇంకా ఇవ్వని వారికి వెంటనే ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండార్స్మెంట్ ఇచ్చిన వారిని సంప్రదించి వారిచే గిఫ్ట్ డీడ్ ఇప్పించు కోవాలన్నారు. రహదారుల అభివృద్ధికి తమ స్థలాలను ఇచ్చినటువంటి యజమానులను ఎన్ని సార్లు కలిసైనా వారి భూములను రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలన్నారు. వీటికన్నా ముందు గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టిడిఆర్ బాండ్లు త్వరితగతిన మనవైపు నుండి ఇప్పించేలా పూర్తి స్థాయిలో పని చేయాలన్నారు. ప్లానింగ్ విభాగంలో ఎటువంటి ఫైళ్ళు కూడా పెండింగ్ వుండరాదని చెబుతూ, పెండింగ్ ఫైళ్ళు ఏవైనా వుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల రూపకల్పనలో అధిక ప్రాధాన్యత ప్లానింగ్ సిబ్బందిదేనని గుర్తు చేస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలు అందరూ సమన్వయంతో కలసికట్టుగా పనిచేసి మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, టిపిఓలు, ప్లానింగ్ సెక్రటరీలు, సుపర్డెంట్లు హసీమ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు 'సమగ్ర సంక్షేమ బోర్డు' ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పాలక ప్రభుత్వాలపై ఆధారపడ కుండా తమకు తాముగా ఉపాధి పొందుతున్న ఆటో కార్మికుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం డిమాండు చేశారు. జీవో నం.21ని తక్షణమే రద్దు చేసి ఆటో కార్మికులపై అక్రమ జరిమానాలను అరికట్టకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శ్రీకాళహస్తిలోని సీఐటీయూ కార్యా లయంలో ఆదివారం ఆ సంఘం అనుబంధ తిరుపతి జిల్లా ఆటో కార్మికుల యూనియన్ ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా నిత్యావసర ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఆటో రిపేర్లకే పెట్టుబడుల్లేని దుర్భర స్థితిలో కేంద్రం తీసుకొచ్చిన మోటారు వెహికల్ సవరణ చట్టం 2019, జీవో నం.21 ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, ఆర్టీవో అధికారులు అక్రమ జరిమానాలు, ఈ-చలాన్లు వేస్తూ ఆటో కార్మికుల జీవితాలను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నత చదువులు చదివిన యువతకు ఉద్యోగాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. జీవో నం.21ని రద్దు చేయాలని కోరారు. ఏపీ ఆటో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్ ఆటో కార్మికుల పక్షాన చేసిన హామీలను అమలు చెయ్యడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంక్షేమ బోర్డు ఊసేలేదన్నారు. వాహనమిత్ర పేరిట ఏడాదికి రూ.10 వేలు అందజేస్తున్నా అర్హులందరకీ అందడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది కార్మికులు ఉంటే మొదటి ఏడాది 3 లక్షల మందికీ, రెండో ఏడాది 2లక్షల మందికి మాత్రమే వాహన మిత్ర సాయమందిందన్నారు. మూడో విడతలో ఎంతమందికి సాయం చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఓవైపు వాహన మిత్ర సాయాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేసి, అదే రోజు ఆర్టీఐ, పోలీస్ శాఖ అధికారులను తనిఖీలకు పంపి ఇచ్చిన సొమ్మును జరిమానా రూపంలో ఆటో కార్మికుల నుంచి ముక్కు పిండి వసూలు చేసుకుంటున్న ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఐక్య పోరాటాల ద్వారా ఆటో కార్మికుల హక్కులను సాధించుకునేందుకు మహాసభ నుంచే సమర శంఖం పూరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, ఆటో యూనిన్ జిల్లా కార్యదర్శి మురళి, రమణ, మనోహర్, వెంకటేష్, మురుగేష్, కుమార్, దుర్గ, గంధం మణి, పెనగడం గురవయ్య, రాజా పాల్గొన్నారు.

మారథాన్ లో డీటీసీ ఎస్ఐ రామకృష్ణ ప్రతిభ

విశాలాంధ్ర-తొట్టంబేడు: హైదరాబాదులో ఎన్ఎండీసీ నిర్వహించిన హాఫ్ మారథాన్ విభాగంలో డీటీసీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న (పూర్వ తొట్టంబేడు ఎస్ఐ) వి.రామకృష్ణ 21.10 కిలోమీటర్ల దూరాన్ని ఒక గంట 43 నిమిషాల 19 సెకండ్లు లో పూర్తి చేసి పథకం సాధించారు. ఈయన గత కొంతకాలంగా రన్నింగ్ పై ఆసక్తి చూపుతూ దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే మారథాన్ విభాగాల్లో పాల్గొని తన ప్రతిభను చాటుతున్నారు. గతంలో బెంగుళూరు, పూణే, సతారా తదితర ప్రాంతాల్లో 10కి.మీ. హాఫ్ మారథాన్... మారథాన్ విభాగంలో 21.01 కి.మీ.... ఫుల్ మారథాన్ విభాగంలో 42.02 కి.మీ. విభాగంలో తన ప్రతిభను చాటుతున్నారు. ఈయన అమెరికాలోని బోస్టన్ లో జరిగే మారథాన్ పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. బోస్టన్ మారథాన్ లో పాల్గొనాలంటే ఈయన 42.20 కి.మీ. ఫుల్ మారథాన్ ను కేవలం మూడు గంటల లోపే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో పాల్గొనేందుకు లక్ష్యంగా నిర్దేశించుకుని ప్రతిరోజు క్రమం తప్పకుండా రన్నింగ్ చేస్తూ గత కొద్ది కాలంగా వివిధ ప్రాంతాల్లో జరిగే రన్నింగ్ పోటీల్లో తన సత్తా చాటుతున్నారు. గతంలో కంటే తక్కువ సమయంలో హాఫ్ మారథాన్ ను పూర్తిచేసుకుని అమెరికాలోని బోస్టన్ లో జరిగే మారథాన్ పోటీల్లో పాల్గొనడానికి కావలసిన విధంగా తాను శిక్షణ పొందుతూ దేశంలో ఎక్కడ జరిగినా మారథాన్ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉంటున్నారు. హైదరాబాదులో ఎన్ఎండీసీ లో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటినందుకు పోలీసు ఉన్నతాధికారులు ఎస్సై రామకృష్ణను అభినందించారు.

చంద్రగిరిలో వైసీపీ నాయకుని ఇంట విషాదం

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలంలో వైసీపీ నాయకుని ఇంట విషాదం చోటు చేసుకుంది. మాజీ ఎంపీటీసీ సీఎం కేశవులు (బుజ్జి) సతీమణి, శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి ఆలయ పాలక మండలి సభ్యులు సి.ఉషా అనారోగ్యంతో ఆదివారం తెల్లవారు ఝమున మృతి చెందారు. ఆ విషయం తెలుసుకున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలు హుటా హుటిన ఆ ఇంటికి చేరుకుని మృతురాలి భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం కేశవులు, అతని కుమారులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరితో మంచిగా ఉంటూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ముఖ్య అనుచరునిగా ఉంటున్న సీఎం కేశవులు భార్య ఉషా ఆకస్మికంగా మరణించటం పట్ల ప్రతి ఒక్కరు దిగ్భ్రాంతికి గురయ్యారు. అన్ని పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులు ఆయన నివాసానికి చేరుకుని సంతాపం వ్యక్తం చేస్తూ ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

43 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

3 మోటారు సైకిళ్లతో ఏడుగురు స్మగ్లర్లు అరెస్టు

విశాలాంధ్ర - సత్యవేడు: సమీపంలోని అడవుల్లో కూంబింగ్ చేపట్టిన టాస్క్ ఫోర్సు పోలీసులు 43ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వీరి నుంచి 3మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు డీఎస్పీ చెంచుబాబు ఆదేశాల మేరకు రైల్వే కోడూరు ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ అలీభాషా శనివారం సాయంత్రం నుంచి సత్యవేడు సమీపంలోని నాగలాపురం అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. ఆదివారం తెల్లవారు జామున బీరకుప్పం ప్రాంతంలో కొందరు మోటారు సైకిళ్లతో అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని ప్రశ్నించడంతో సంబంధం లేని సమాధానాలు చెప్పారు. దీంతో వీరిని అదుపులోకి తీసుకోగా, వీరి వద్ద 43ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు అంగీకరించారు. వీరి నుంచి ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని తమిళనాడు తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూడి తాలూకాకు చెందిన సభాపతి ధర్మన్ (45), తిరుపతి జిల్లా తొండవాడకు చెందిన ఐ.రవి(32), తిరుపతి సత్యనారాయణపురంకు చెందిన ఎన్.కోదండపాణి (46), సత్యవేడు మండలానికి చెందిన ఎం. నరసింహులు (50), తిరుపతి అవిలాలకు చెందిన బి.రమేష్ (42), నాగలాపురం బీరకుప్పంకు చెందిన ఏ రమేష్ (34), ఏ.మారయ్య (65)లుగా గుర్తించారు. దుంగలు 664కేజీలు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30లక్షలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో నమోదు చేసి ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి భూమన్

- మూడు తరాల మనిషి భూమన్ పై ప్రశంసల జల్లు
- భూమన్ ఆదర్శ ప్రాయుడన్న టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి : భూమన్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు ప్రశంసల జల్లు కురిపించారు. సమాజ హితం కోసం అనేక ఉద్యమాలను చేసిన గొప్ప సంఘ సంస్కర్తగా పేర్కొన్నారు. మూడు తరాల మనిషి భూమన్... పుస్తక ఆవిష్కరణ సభ ఆదివారం ఉదయం తిరుపతి ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. భూమన్ కు ఆత్మీయ సత్కారం జరిగింది. మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన,టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే, మానవ వికాస వేదిక గౌరవ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి సభనుద్దేశించి మాట్లాడారు. సామాన్య ప్రజల కోసం భూమన్ తిరుపతి వేదికగా అనేక ఉద్యమాలను నిర్వహించిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. తిరుపతిలో ఉద్యమాలు మొదలుపెట్టి రాష్ట్రమంతా అల్లుకుపోయారని, 55 సంవత్సరాల క్రితమే రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనానికి మారుపేరుగా నిలిచారని కొనియాడారు. సామాన్య ప్రజల జీవన గతులను మార్చాలన్న దృఢ సంకల్పంతో పనిచేసిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. తమ జీవన గమనాన్ని మార్చిన వారిలో త్రిపురనేని, భూమన్ ముందు వరుసలో ఉంటారని తెలిపారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా గుండె నిబ్బరంగా ఉండాలని తన అన్న ద్వారానే స్ఫూర్తిని పొందానని చెప్పారు. తాము విప్లవ రాజకీయాల నుంచి ఉద్భవించిన వారమన్నారు. అందుచేత తను నాస్తి కుడని, క్రైస్తవుడంటూ దురుద్దేశంతో... రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తూ మాట్లా డుతున్న వారి మాటలకు భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని భూమన హెచ్చ రించారు. టీటీడీ ఛైర్మన్ గా గతంలోనూ అనేక కార్యక్రమాలను నిర్వహించానని గుర్తు చేశారు. ప్రస్తుత ఎస్వీబీసీ తన ఆలోచనల నుంచే ఉద్భవించిందే, కళ్యాణ మస్తు ద్వారా పెళ్లిళ్లు నిర్వహించిందీ తనేనని తిరుపతిలో వేద విశ్వవిద్యాలయాన్ని స్థాపించడంలో తను కీలక పాత్ర పోషించానని, శ్రీవారి కళ్యాణోత్సవాలను వాడ వాడల్లో నిర్వహించడం ఆ భగవంతుడు తనకు ఇచ్చిన అనుగ్రహం అని పేర్కొ న్నారు. నాలుగు సంవత్సరాల్లో టీటీడీ చేపట్టిన కార్యక్రమాలపై రూపొందించిన వీడియో ను, వచ్చే నెలలో మహతి ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్టు ఏవీ ధర్మారెడ్డి వెల్లడించారు.విశిష్ట అతిథి అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు సభలో మాట్లాడారు.భూమన్ పుస్తకాల పురుగుగా పేర్కొన్నారు. భూమన సోదర ద్వయం చిన్న తనం నుంచే సమాజ హితం కోరుకునే స్వభావాన్ని అలవరుచు కున్నారని తెలిపారు. ఈ సభకు అధ్యక్షత వహించిన జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడారు. భూమన సోదరులు ఎంతో ముందు చూపు కలిగిన గొప్ప వ్యక్తులు అని ప్రశంసించారు. ఆత్మీయ అతిథిగా సీనియర్ జర్నలిస్టు తాడి ప్రకాష్ సభలో మాట్లాడారు. సమాజ హితం కోసం పనిచేసే వ్యక్తిగా భూమన్ అందరికీ మార్గ దర్శిగా నిలిచారన్నారు. మూడు తరాల మనిషి పుస్తక

రచయిత,సన్మాన గ్రహీత భూమన్ మాట్లాడారు. సామాజిక ఎదుగుదల కోసం తాను, తన తమ్ముడు భూమన కరుణాకర రెడ్డి పనిచేస్తు న్నారన్నారు. సామాజిక దృక్పథంతో మసులు కోవాలని సూచించారు. మన తిరుపతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని ఈ ఊరిని అపప్రదం చేయవద్దని భూమన్ పేర్కొన్నారు. .ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, మానవ వికాస వేదిక ప్రతినిధులు సాకం నాగరాజు, శైల కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

డ్రైనేజి పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర- పుంగనూరు: స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా పట్టణ ప్రాంతంలో ప్రతి చోటా ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశుధ్య కార్మికులు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం ఐదు గంటలకే పారిశుధ్య కార్మికులు 7,8 వార్డులలో చేపట్టిన డ్రైనేజ్ పనులను మున్సిపల్ చైర్మన్ నలిం బాష స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తేలికపాటి వర్షం కురవడంతో ఎక్కడ నీళ్లు అక్కడే ఆగిపోతున్నాయని ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. పట్టణంలోని 31 వార్డులలో నిత్యం డ్రైనేజీ పనులు ప్రత్యేకంగా చేపట్టా లని సూచించారు. గతంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్‌లో మన పుంగనూరు మున్సి పాలిటీ ప్రత్యేక అవార్డును సొంతం చేసుకున్నా మన్నారు. ఇప్పుడు కూడా రాష్ట్ర స్థాయిలో పుంగనూరు మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలబడడానికి ప్రతి ఒక్క కౌన్సిలర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు. ప్రత్యేకంగా మున్సిపల్ చైర్మన్ స్వయంగా డ్రైనేజీ పనులను ఉదయం 5 గంటలకే పర్యవేక్షణ చేయడంతో స్థానికులు ఆయనను అభినందించారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రతి నాయకుడికీ గుర్తింపు ఉంటుందని ప్రజలు ఆయనను కొనియాడారు.

28 నుంచి వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు

విశాలాంధ్ర- కార్వేటినగరం: ఈ నెల 28వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు నిర్వహించ నున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ అధికారి మాట్లాడుతూ 28 వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహి స్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం కావాలన్నారు.

కార్యక్రమాల వివరాలు

28వ తేదీ సోమవారం 9 గంటలకు కోదండరామ స్వామి వారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు స్వామివారికి తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు. 29వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారికి వేదపండితుచే స్నపన తిరుమంజనం ఉంటుందని, సాయంత్రం 4గంటలకు వేణుగోపాలుని తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. 30వ తేదీ బుధవారం 9గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4గంటలకు గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు.

జిడి నెల్లూరులో జనసేన జెండా ఎగురేస్తాం: జనసేన

విశాలాంధ్ర- కార్వేటినగరం :గంగాధర నెల్లూరు నియోజక వర్గంలో 2024లో జరిగే ఎన్నికలలో జనసేన జెండా ఎగుర వేస్తామని జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, జీడి నెల్లూరు ఇన్‌చార్జి పొన్న యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం కార్వేటినగరంలో జనసేన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఒక ఛాన్స్ అంటూ వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. న్యాయం కోసం జనసైనికులు పోరాడితే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని వైసీపీ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికి గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. జీడి నెల్లూరు ఇన్‌చార్జి పొన్న యుగంధర్ మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని, ప్రజలంతా జనసేనకి పట్టం కట్టడం జరుగుతుందన్నారు. పెద్ద ఎత్తున జనసైనికులు ముఖ్య అతిథితులకు బాలసంచాలతో స్వాగతం పలికారు. ఓ మహిళ మాట్లాడుతూ తన ఇల్లును వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో జనసైనికులు బీగాల అరుణ, మీడియా కోఆర్డినేటర్ చంద్రమౌళి, అధ్యక్షులు శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సంయుక్త కార్యదర్శి రాఘవ మండల అధ్యక్షులు సురేష్ రెడ్డి రూప జ్యోతి శ్రీ, ఆరు మండలాల జనసైనికులు పాల్గొన్నారు.

వైభవంగా నాగ రాళ్ల మండల పూజ

విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల మండలం ఎర్ర పాపి రెడ్డి గారి పల్లెలో ఆదివారం నాగ రాళ్ల అశ్వత్థ నారాయణస్వామి మండల పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చనలు , ప్రత్యేక పూజలు జరిపారు ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు మండల పూజ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందించారు. ఉభయ దారులుగా పాళెం కు చెందిన అమర్నాథ్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు మండల పూజలో పాల్గొని పూజలు చేశారు.

రోటరీ క్లబ్ వారి ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర -సదుం: రోటరీ క్లబ్ తిరుపతి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం అరవింద్ హాస్పిటల్ (ఇవైఇ) తిరుపతి వారు , మెటర్నటీ హాస్పిటల్ తిరుపతి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన ఓ పి 380 మంది ఆపరేషన్ కు సెలెక్ట్ అయిన వారు 67 మంది ఆ విధంగా మెటర్నటీ హాస్పిటల్ డాక్టర్స్ ఓపిలలో పాల్గొన్నవారు మహిళలకు 130 మందికి పాప్ సింగర్ టెస్టులను, షుగర్ బీపీ అన్ని చెకప్ లు చేసి అవసరమున్న వారిని తిరుపతి మెటర్నటీ హాస్పిటలకు ఉచితంగా ఓపి టెస్టులు అన్ని నిర్వహించి వారికి కావలసిన మెటర్నటీ ట్రీట్మెంటును ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అరవింద హాస్పిటల్ బృందం తిరుపతి డాక్టర్ భీష్వజిత్ (ఎంవో),డాక్టర్ రచన(అసిస్టెంటు ఎంవో), డాక్టర్ మానస (అసిస్టెంటు ఎంవో), గైనిక్ బృందం మెటర్నిటీ హాస్పిటల్ తిరుపతి డాక్టర్ ఉమాదేవి గైనకాలజిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తార తారణ, డాక్టర్ కవిత, డాక్టర్ మానస , డాక్టర్ వినేష్, డాక్టర్ లికిత, రోటరీ ఫాస్ట్ ప్రెసిడెంట్ కె చలపతి, రామ్మోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ రాజకుమార్, సెక్రటరీ సోము రవికుమార్, కుంచ లక్ష్మీపతి, జాయింట్ సెక్రటరీ ముఖ్యులు, నిర్వహణలకు రోటరీ ధనుంజయ రాజు ఎంసీ రెడ్డి అప్ప రెడ్డి, రాజేష్ కుమార్, చిలిపి రెడ్డి, నీది లోకల్ ముఖ్య అతిథులు కృష్ణారెడ్డి కార్యక్రమం స్పాన్సర్స్ కె వి చలపతి, ధనుంజయ రాజు నిర్వహించారు.

బోయకొండలో భక్తుల రద్దీ

విశాలాంధ్ర - తిరుపతి: చౌడేపల్లి మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ను దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం సెలవు రోజు కావడంతో చిన్న పిల్లలు వృద్ధులు కుటుంబ సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు ఆలయ ఈవో చంద్రమౌళి భక్తులు సౌకర్యార్థంగా అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ లందు తాగునీరు అందరికీ అందేలా సిబ్బందికి చర్యలు చేపట్టామన్నారు. శ్రావణమాసంలో కూడా అమ్మవారిని దర్శించుకోవడానికి ఆంధ్ర కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో బోయకొండ చేరుకొని తమ మొక్కలను చెల్లించుకున్నారు. తిరుపతికి చెందిన ఓ భక్తుడు 19 లక్షల 5000 రూపాయలు విలువగల మినరల్ ప్లాంటును తిరుపతి వాసి సుబ్బరాయుడు అందజేశారు .రాజంపేట వెంకటసుబ్బయ్య 65 వేల రూపాయలు విలువగల కూలర్ ను అందజేశారు తిరుపతికి చెందిన రామచంద్రయ్య విరాళంగా అందజేశారు. భక్తులు నడకదారిలో వచ్చే వారికి సౌకర్యార్థంగా కూలర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రమౌళి ఈవో అన్నారు .పెద్దిరెడ్డి ఆదేశాల మేరకే అన్ని జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గంగిరెడ్డి, దాము ,సుధాకర్ ,కృష్ణప్ప ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయన క(ప)ట్టుబడ్డారా...?!

- జిల్లాల పునర్వ్యవస్థీకరణలో డిప్యూటీ సీఎం పంథా - వెదురుకుప్పం, కార్వేటినగరం ప్రజా వినతులు బుట్టదాఖలు
- అఖిలపక్షం నిరసనలు భేఖాతర్ - అంతా రాజకీయ స్వార్థమే..

విశాలాంధ్ర-వెదురుకుప్పం: జీడినెల్లూరు నియోజకవర్గం..అదేనండి మన ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇలాకా..ఈ నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం, కార్వేటినగరం, శ్రీరంగరాజ పురం, జీడినెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు మండలాలు ఉన్నాయి. డిప్యూటీ సీఎం కు రాజకీయ ప్రస్థానం కార్వేటినగరం లో మొదలయినా ఆయనకు రాజకీయ భిక్ష పెట్టింది వెదురుకుప్పం మండలమే అని చెబుతుంటా రాయన. సరిగ్గా విషయాని కొస్తే...ప్రభుత్వం గతేడాది జనవరి లో చిత్తూరు తిరుపతి జిల్లాల పునర్వ్యవస్థీకరణ కు ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే అప్పటికే తిరుపతి తుడా పరిధిలో ఉన్న వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని పెద్ద ఎత్తున ప్రజల నుంచి తమ విన్నపాలను అధికార యంత్రాంగానికి అందించారు. భారీ స్థాయిలో ప్రజలు, విద్యార్థులు, ప్రజా సంఘాలు ర్యాలీలు నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు నిరసనలు, వినతులు అందించారు. ఈ రెండు మండలాలు తిరుపతి జిల్లాలో కలిపే చర్యలు తీసుకోవాలని అప్పట్లో డిప్యుటీ సీఎం నారాయణ స్వామి పై అధికార పార్టీ నేతలు కూడా ఒత్తిడి తీసుకొచ్చినట్లు ప్రచారంలో ఉంది.ఇంతలో వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలు రెవెన్యూ డివిజన్ లోకి మార్పు చేశారు.ఆ తర్వాత ప్రతిపక్షాలు,స్థానికుల గొడవలు తో ఎట్టికేలకు వెదురుకుప్పం మండలాన్ని యధావిధిగా చిత్తూరు రెవెన్యూ డివిజన్ లోకి మార్చి చేతులు దులుపుకొన్నారు.అయితే నారాయణ స్వామి సొంత మండలాన్ని కార్వేటినగరం మండలాన్ని కూడా నగరి డివిజన్ నుంచి మార్పు చెయ్యలేక పోయారనే విమర్శలూ ఉన్నాయి.ఈ రెండు మండలాలను తిరుపతి జిల్లా లో కలిపేందుకు ఆయన సుముఖత చూపక పోయినా తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో కలిపేందుకు ముఖ్య ప్రణాళిక కార్యదర్శికి లేఖ రాసి గాలికొదిలేసారని విమర్శలు వచ్చిపడుతున్నాయి.

ఇదంతా రాజకీయ స్వార్థమేనా?

సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి తర్వాత ఉపముఖ్యమంత్రి స్థానం లో నారాయణ స్వామి ఉండి కూడా రాష్ట్రంలో అత్యధికంగా ఓట్లు మెజారిటీ ఇచ్చిన మండల ప్రజల ఈ రెండు మండలాలను తిరుపతి జిల్లా లో కలపాలనే మనోభీష్టానికి చెక్ పెట్టారని,ఇదంతా తమ ముందస్తు వారసత్వ రాజకీయ స్వార్థమే అని ప్రచారంలో ఉంది.నగరి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి ఎమ్మెల్యే,ప్రస్తుత మంత్రి ఆర్ కె రోజా పుత్తూరు, వడమాల పేట మండలాలను తిరుపతి జిల్లాలో కలిపి ప్రజల మన్న నలు పొందారు. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గం నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతికి సుమారు 45 కిలోమీటర్లు ఉన్న పులిచర్ల, రొంపిచర్ల మండలాలను తిరుపతి జిల్లాలో కలపడానికి ప్రతి పాదనలు ఇప్పటికే పూర్తిచేసి ప్రభుత్వానికి అందించినట్లు తెలుస్తోంది. కేవలం తిరుపతి కి 30-35 కిలోమీటర్లు దూరం ఉన్న కార్వేటినగరం ,వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లా లో కలపడానికి ఉప ముఖ్యమంత్రి ఎందుకు వెనుకడుతున్నారని ప్రశ్నిస్తున్నారు.డిప్యుటీ సీఎం ఫందా ఏంటో అర్థం కాని పరిస్థితి అని స్వపక్షం లోనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతినిత్యం రైతులు, చిరుద్యోగులు తిరుపతి కేంద్రం గానే రాకపోకలు సాగిస్తున్న పరిస్థితి.ఇదంతా తెలిసినా డిప్యూటీ సీఎం ఆసక్తి చూపకపోవడం పలు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఈ రెండు మండలాలు తిరుపతి జిల్లా లో కలిస్తే భవిష్యత్ లో అక్కడ అసెంబ్లీ నియోజక వర్గాల లోకి కలిపేస్తారని ముందస్తు స్వార్థ ప్రణాళికలలో భాగంగానే మంత్రి పట్టించుకోలేదని అభిప్రాయపడుతున్నారు.ఏది ఏమ యినా పుంగనూరు నియోజకవర్గం లో రెండు మండలాలను తిరుపతి జిల్లాలో కలపడానికి పావులు గడుపుతున్న తరుణంలో వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను కూడా ప్రజాభీష్టం మేరకు తిరుపతి జిల్లా లో కలిపేందుకు డిప్యూటీ సిఎం నారాయణ స్వామి చర్యలు చేపట్టాలని కోరు తున్నారు. అలా చర్యలు లేని పక్షం లో రానున్న ఎన్నికల్లో తగినమూల్యం చెల్లించక తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

హెలిప్యాడ్, బహిరంగ సభ ఏర్పాట్ల పర్యవేక్షణ

- విద్యా రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి
- నగరి నియోజకవర్గం నుండి జగనన్న విద్యా దీవెన ప్రారంభం సంతోషం
- ఎన్నికల హామీలను 99 శాతం పూర్తి చేశాం
- మా ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- రాష్ట్ర విద్యుత్, అటవీ, శాస్త్ర సాంకేతిక, భూ గర్భ గనుల శాఖ మంత్రి

విశాలాంధ్ర - నగరి : విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి పలు సంస్కరణలు చేపట్టి విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, శాస్త్ర సాంకేతిక, భూ గర్భ గనుల శాఖ మంత్రి డా. పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 28 న జగనన్న విద్యా దీవెన ఏప్రిల్- జూన్ 2023 త్రై మాసిక లబ్ధిని రాష్ట్ర వ్యాప్తంగా చిత్తూరు జిల్లా నగరి నుండి లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం బహిరంగ సభ, హెలిప్యాడ్ వద్ద శరవేగంగా జరుగుతున్న ఏర్పాట్లను డిప్యూటీ సి ఎం కె. నారాయణస్వామి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి, రాష్ట్ర సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, చిత్తూరు ఎం పి రెడ్డెప్ప, ముఖ్యమంత్రి పర్యటనల ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ తలశీల రఘురాం, కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్పీ వై. రిశాంత్ రెడ్డిలతో కలసి పరిశీలించారు. వీరితో పాటు ఎం ఎల్ సి భరత్, తంబళ్లపల్లి, సత్యవేడు శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, ఆదిమూలం, డిఆర్ఓ ఎన్. రాజశేఖర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్, అటవీ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డా. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 28న చిత్తూరు జిల్లా నగరి నుండి జగనన్న విద్యాదీవెన ఏప్రిల్- జూన్ 2023 త్రై మాసికానికి సంబంధించి ఫీజు రీయింబర్సుమెంట్ ను విడుదల చేసే రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని మంత్రులు, శాసన సభ్యులు, ముఖ్యమంత్రి పర్యటనల సలహాదారు, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నియోజకవర్గ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. ఎన్నికల హామీలను 99 శాతం పూర్తి చేశామ ని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల యందు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధి లో భాగంగా ప్రభుత్వం అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, నాడు - నేడు తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ రాజ్ ఎస్ ఈ చంద్రశేఖర రెడ్డి, జెడ్ పి సి ఈ ఓ ప్రభాకర్ రెడ్డి,డి పి ఓ లక్ష్మీ,డి పి ఎం ఓ షణ్ముగం, నగరి, కుప్పం ఆర్ డి ఓ లు సుజన, శివయ్య, నగరి తహశీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి, ఎం పి డి ఓలీలామాధవి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణా రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీపతి యాదవ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- పలమనేరు : బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి యాద వ్ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా ఆ యన అభిమానులు స్నేహి తులు శ్రేయోభిలాషులు స్థానిక ఏటీఎం సర్కిల్ వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టుకొని ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, కౌన్సిలర్ మండి సుధా, డాక్టర్ యుగంధర్, ప్రహల్లాద,ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ బి ఆర్ సి కుమార్, హైదర్, ముని కృష్ణయ్య, స్నేహితులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర- పలమనేరు : 20 23 ఆగస్టు 27 తేదీన విడుదలైన ఎస్ వి యూనివర్సిటీ 6 సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో ఈ కళాశాల విద్యార్థులు బీకాం(సిఏ)లో ముస్కాన్(9.31) జ్యోతిక(8.97) నజియా(8.94) నికిత (8.94) దీప్తి(8.91) నాగ మౌనిక(8.89) కావ్య శ్రీ(8.80) జి ఎస్ జి పి ఏ సాధించారు. బీకాం నందు101 డిసెక్షన్99 ప్రథమ శ్రేణి నందు ఉత్తీర్ణులైనట్టు కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన రావు తెలిపారు. ఈ విజయా నికి కారకులైన విద్యార్థినీ విద్యార్థులను అధ్యాపకులను కరస్పాం డెంట్ ఎం రవీంద్రబాబు, చైర్మన్ ఎం ఆర్ సునీల్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి,వారిని అభినందించారు.

నీతి పద్యాలు దారి చూపే నేస్తాలు

విశాలాంధ్ర-పలమనేరు: పిల్లలు నేర్చుకునే నీతి పద్యాల భవిష్యత్తుకు దారి చూపే నేస్తాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసి నాదం నాయుడు అన్నారు. ఆదివారం కళా మందిరంలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రస్థాయి పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 80 మంది విద్యార్థులు 100 నుండి 200 వరకు పద్యాలను అవలీలంగా చెప్పగలిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యాలు నేర్చుకోవడం వల్ల నైతిక విలువలు అలవర్చుకోవడంతోబాటు ధారణ శక్తి పెరుగుతుందన్నారు. హరివిల్లు వ్యవస్థాపకులు మహాకవి మునస్వామి తెలుగు భాష చరిత్రను పద్యాలలోని రకాలను శ్రావ్యంగా పాడి వినిపించారు. 80 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలు జ్ఞాపికలు పుస్తక బహుమతులు సంస్థ కార్యదర్శి పుష్ప అందించారు. మొదటి 5స్థానాలలో నిలిచిన సాయి ధ్యాన్ చంద్, జై వర్ధన్, పావని, లక్ష్మశ్రీ, డింపుల్ లకు, బహుమతులతో బాటు ఐదేసి వందల రూపాయలు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరయ్య, కళావతి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, శివ శంకర్ రెడ్డి, సుదర్శన్ ఆచారి, ముద్దు కృష్ణ, జయలక్ష్మి, సాధన కుమార్ పాల్గొన్నారు.

క్యాష్ కోసమే తీహార్ నుంచి టీటీడీ బోర్డుకి

టీడీపీ ఆరోపణ

విశాలాంధ్ర - తిరుపతి: ప్రపంచ ప్రసిద్దిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో ధనమే ధ్యేయంగా తీహార్ జైల్లో లిక్కర్ మాఫియాలో నిందితులుగా ఉన్న వారికి టిటిడి పాలకమండలి లో సభ్యులుగా అవకాశం ఇవ్వడం దారుణమని తెలుగుదేశం పార్టీ నేతలు నరసింహ యాదవ్ , ఊక విజయ్ కుమార్ , చినబాబు , ఆర్సి మునికృష్ణ , గంధం బాబు , చేజర్ల మనోహర్ ఆచారి , శ్రీనివాసులు , యశ్వంత్ లు ఆరోపణలు చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆదివారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ వైకాపా పాలనలో గత టీటీడీ బోర్డు మెంబర్ల ఎంపిక లో 80 మంది వరకు జంబో జట్టు ను ఏర్పాటు చేస్తే న్యాయస్థానం 30 మంది మాత్రమే సభ్యులుగా ఉండా లంటూ ఆజ్ఞలు జారీ చేయడంతో. కొంతవరకు దోపిడి దారుల పీడ తగ్గిందన్నారు నేడు అదే కోవలో దొంగలతో పాలకు మండలి నింపాలని చూస్తున్నారని దుయ్య బట్టారు.గతంలో శ్రీవారితో పెట్టుకున్న వారు ఏమయ్యారో జరిగిన చరిత్ర చెబుతుందన్నారు.నేడు కూడా అదే దొంగ ధోరణితో వ్యవహరిస్తే వెంకన్నే వారికి తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - తిరుపతి : స్థానిక మహతి కళాక్షేత్రంలో ప్రపంచ జానపద మాసోత్సవంలో భాగంగా మన సంస్కృతి కళా సంస్థ (తిరుపతి) వారి ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు సంస్థ అధ్యక్షులు రంగాని సహదేవ నాయుడు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. పై కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు బౌద్ధ దమ్మ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కుప్పం రెడ్డమ్మ సాహితి పురస్కారాల సంస్థలు వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. కె. రామలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట నుంచి పాట ఉద్భవిస్తే పాటకు సంగీతం జతకలిసి కళగా రూపాంతరం చెందింది. మన ముందు తరాలవి శ్రమైక జీవనం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. జానపదాలకు పల్లెలే పుట్టిల్లు. పల్లెపడుచులు లయ బద్ధంగా పాడుకునే పాటలు శ్రావ్యంగా ఉండి మనోల్లా సాన్ని కలిగిస్తాయి. బుర్రకథలు ,ఒగ్గు కథలు, హరికథలు ,వీధి నాటకాలు,తోలుబొమ్మలాటలు,చెక్క భజనలు ,పండరి భజనలు, గొబ్బి పాటలు,కోలాటాలు మొదలగు జానపదాలు ఆనాటి పల్లె ప్రజల జీవన విధానంలోని ఆచారాలు, వ్యవహారాలు, సాంప్రదాయాలు నుండి పుట్టినవే జానపదాలు అన్నారు. ఈ జానపదకళలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని పిలుపునిచ్చారు. అనంతరం ఈవిధ జిల్లాల నుండి వచ్చిన గాయని గాయకులు ఉదయం 10:00 నుండి సాయంత్రం మూడు గంటల వరకు జానపద గీతాలు ఆలపించారు. పై కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ వ్యవస్థాపకులు మరియు ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డెప్ప, గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, ప్రముఖ రచయిత్రి ఎం.ఆర్ అరుణ కుమారి, చింత గుంపల ఆనంద నాయుడు, కొత్తపల్లి మునిరత్నం, నాయినారు వరప్రసాద్, వెంకట శేషయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - వరదయ్యపాలెం: వరదయ్యపాలెం మండలం ముస్లిం పాలెం లో రైతు హాషిం (46) సొంత ఇంటిలో కరెంటు పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. హాషిం కు భార్య ముగ్గురు పిల్లలు వున్నారు. వ్యవసాయంలో గత కొంతకాలం క్రితం నష్టపోయి కుటుంబ భారాన్ని మోయలేక సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి గల్ఫ్ దేశాలకు వలస కూలీగా వెళ్లాడు. తిరిగి నేల తల్లిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో కుటుంబ పెద్దను పోగొట్టుకున్న ఆ భార్య పిల్లల ఘోష చూసి ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారు లు ఆ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపీ

విశాలాంధ్ర -కార్వేటినగరం: వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.గోపీని నియమించడం అభి నం దమయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయ ణ స్వామి కుమార్తె వైసీపీ సీనియర్ నాయకురాలు కృపా లక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీని కృపాలక్ష్మి, ఎంపీపీ లతబాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ పలువురు సర్పంచ్ లు, నాయకులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తున్న గోపీని జిల్లా కార్యదర్శిగా నియమించడం సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా నియమితులైన గోపి మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి హోదా నిచ్చి బాధ్యతను మరింత పెంచారని పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేస్తానని అన్నారు. జిల్లా కార్యవర్గంలో తనకు గుర్తింపు నిచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి. నారాయణస్వామికి సేవకుడై పని చేస్తానని, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్రెడ్డి. అనిల్ కుమార్, యుగంధర్ నాయుడు, శేషాద్రి, నాగమణం పలువురు పాల్గొన్నారు.

రేపు ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ

విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఏపీఓషౌకత్ ఆలీ తెలిపారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించాలని తనిఖీల నివేదికలను బహిరంగ సభలో వెల్లడిస్తారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రైతులు, కూలీలు పాల్గొనాలని వారు కోరారు.

ప్రతి మూడిళ్లకు ఒక తాగునీటి కుళాయి

- కుదువగడ్డలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎంపీపీ

విశాలాంధ్ర - వి. కోట: మండల పరిధిలోని చింత మాకులపల్లి పంచాయతీ కుదువగడ్డ గ్రామంలో ప్రతి మూడిళ్లకు ఒక తాగునీటి కుళాయి ఏర్పాటు తో శాశ్వత పరిష్కారం చేసి నట్లు ఎంపీపీ కె. యువరాజ్ తెలిపారు. దశా బ్దాల నుండి గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యను ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సుమారు 550 మీటర్ల పైపులైన్లు ఏర్పాటు చేసి తాగు నీటిని గ్రామస్తులకు అందుబాటులోకి తెచ్చారు. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ లను పరిశీలించిన ఆయన సుమారు 500 మీటర్ల నూతన డ్రైనేజ్ కాల్వలు నిర్మించి గ్రామంలో తిష్ట వేసిన పారిశుధ్య సమస్య ను సైతం పూర్తిగా తీర్చారు. ఆదివారం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తిష్ట వేసిన సమస్యలు శాశ్వతంగా తీర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు ఎన్. వెంకటేగౌడ చొరవ వల్లే నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న తిరుచానూరు శ్రీకృష్ణస్వామి ఆలయంలో గోకులాష్టమి

విశాలాంధ్ర - తిరుపతి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో సెప్టెంబరు 7వ తేదీన గోకులాష్టమి పర్వదినాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గోకులాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణ స్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన నిర్వహిస్తారు. శ్రీ కృష్ణస్వామి ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు శ్రీ కృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ జరుగనుంది. రాత్రి 7 నుండి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి కటాక్షించనున్నారు. అనంతరం రాత్రి 8.30 నుండి 9 గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు.అదేవిధంగా సెప్టెంబరు 8న ఉట్లోత్సవంను పురస్కరించుకొని మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, తరువాత ఊంజల్‌సేవ జరుగనుంది. సాయంత్రం 6.15 నుండి రాత్రి 7.30 గంటల వరకు స్వామివారికి ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు.ఈ కారణంగా సెప్టెంబరు 8న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది.

దేవస్థానం ఆర్చీల వద్ద రాజకీయ ఫ్లెక్సిలు, బ్యానర్లు తొలగించండి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : దేవస్థానము ఆర్చిల వద్ద రాజకీయ ఫ్లెక్సిలు, బ్యానర్లు తొలగించాలని సంబంధిత ఫ్లెక్సీల వ్యక్తులకు, రాజకీయ నాయకులకు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా భక్తులను ఆకర్షించే విధంగా శ్రీకాళహస్తి పట్టణం ప్రముఖ కూడళ్ళు అనగా ఏపి సీడ్స్ సర్కిల్, పొన్నాలమ్మగుడి సర్కిల్, కుమార స్వామి తిప్ప, ఉరందూరు రోడ్డు, నంది సర్కిల్ నందలి దేవస్థానము వారిచే ఆర్చీలను నిర్మించడం జరిగిందన్నారు. సదరు ఆర్చీల ముందు రాజకీయ ఫ్లెక్సిలు, బ్యానర్లు ఏర్పాటుచేయడం వలన సదరు ఆర్చీలశోభ పోవుచున్నదని, అదేవిధంగా సదరు రాజకీయ ఫ్లెక్సిలు, బ్యానర్లు ఏర్పాటుచేయడం వలన భక్తుల మనోభావములు దెబ్బతినే విధముగా ఉన్నాయన్నారు. శ్రీకాళహస్తి పట్టణములో ఉన్న అన్నీ రాజకీయ పార్టీలకు తెలుతున్నామని భక్తుల మనోభావములు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవాలయం విశిష్టతను దృష్టి పెట్టుకొని శ్రీకాళహస్తి పట్టణం ప్రముఖ కూడళ్ళు అనగా ఏపి సీడ్స్ సర్కిల్, పొన్నాలమ్మగుడి సర్కిల్, కుమార స్వామి తిప్ప, ఉరందూరు రోడ్డు, నంది సర్కిల్ నందలి ఆర్చీల ముందు వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సిలు, బ్యానర్లను ఏర్పాటుచేసియున్న వాటిని వెంటనే మీ ద్వారా ఒక వారము లోపల తొలగించి దేవస్థానమునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అట్లు లేకుంటే దేవస్థానం సిబ్బంది ద్వారా సదరు రాజకీయ పార్టీల ఫ్లెక్సిలు, బ్యానర్లు తొలగించబడతాయన్నారు.

సురుటిపల్లి ఆలయంలో షెడ్ నిర్మాణం, రథం పనులు వేగవంతం

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో అరుణానది పక్కన ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులు పరుగులు తీస్తోంది. ఆలయానికి మూడు నెలల క్రితమే నూతనంగా ధర్మకర్తల మండల నియామకం జరిగింది. ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్‌గా సత్యవేడు మండలం దాసుకుప్పం గ్రామానికి చెందిన ఏవీఎం బాలాజీ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆలయ అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే రథం షెడ్డు నిర్మాణం, రథం పనులు, భక్తుల వసతి గృహ నిర్మాణాలు, కళావేదిక వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయంలో శ్రీ మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు కోసం రథం పనులు, రథం షెడ్డు పనులు చేపట్టారు. ఇందుకు అవసరమైన నిధులను విరాళంగా ఇవ్వడానికి శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దాత, శివభక్తుడు టీంగిమల్ల సురేష్ శెట్టి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో దాదాపు 32 లక్షల రూపాయల అంచనా వ్యయంతో రథం,షెడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో దాత సురేష్ శెట్టి 25 లక్షల రూపాయల విరాళాల సొమ్ముతో రథం పనులు గత రెండు నెలలుగా కొనసాగుతున్నాయి. తమిళనాడు సేలంకు చెందిన ప్రముఖ శిల్ప కళాకారుడు వాసు ఆధ్వర్యంలో దాదాపు పది మంది శిల్పకారులు రథం పనులు చేస్తున్నారు. ఇప్పటికే రథం పనులు తుది దశకు చేరుకున్నాయి. రథం పూర్తయితే ఆలయంలో ప్రతి ఏడాది వైభవోపేతంగా జరిగే మహాశివరాత్రి మహోత్సవాల్లో శ్రీ మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను రథం ద్వారా మాడ వీధుల మీదుగా ఊరేగించనున్నారు. రథం ఉంచడానికి ఆలయం ఎదురుగా రథం షెడ్డును నిర్మిస్తున్నారు. ఇది కూడా దాదాపు పూర్తి కావస్తోంది. దీనికి కూడా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దాత సురేష్ శెట్టి సమకూర్చిన విరాళాల సొమ్ము దాదాపు 7 లక్షల రూపాయలతో చెన్నైకి చెందిన గుత్తేదారుడు కుమారేషన్ రథం షెడ్డును నిర్మిస్తున్నారు. మరో నెలలో రథం, రథం షెడ్డు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నట్లే ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి చెప్పారు. కాగా సురుటపల్లి ఆలయంలో మూడు నెలల క్రితమే బాధ్యతలు స్వీకరించిన ధర్మకర్తల మండలి ప్రధానంగా ఆలయ అభివృద్ధి పనులపై దృష్టి సారించడం వల్లే కొన్ని పనులు జోరందుకుంది. ఆలయ ఆదాయం కూడా గతంలో కన్నా ఇప్పుడు అధికమైనట్లు ఆలయ అధికారులు పే ర్కొంటున్నారు.

నేదురుమల్లికి బత్తిని సన్మానం

విశాలాంధ్ర - గూడూరు : తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వ యకర్త, బోర్డ్ ఆఫ్ డెవలప్మెంట్ చైర్మన్ నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి రెండ వ సారి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సంద ర్భంగా ఆదివారం వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ నాయకులు బత్తిని విజయ్ కుమార్ ఆయన అనుచర గణంతో మర్యాద పూర్వకగా నేదురు మల్లిని కుమార్ రెడ్డి వాకాడు లోని ఆయన నివాసంలోనే కలసి గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా బత్తిని విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే పరమా వధిగా నిరంతరం శ్రమించే ప్రజా బంధు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి రెండవ సారి జిల్లా అధ్యక్షులుగా సీఎం జగన్మోహన్ రెడ్డి నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన నేతృత్వంలో జిల్లా లోని నాయకులందరూ సమన్వయంతో పని చేసి రానున్న ఎన్నికలలో అఖండ మెజారిటీతో అభ్యర్థు లందరినీ గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్ భాయ్, అహ్మద్, చంద్రమోహన్ రెడ్డి, పొణకా దామోదర్, సురేంద్ర, సుమంత్, రవి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు

- కన్నుల పండువగా స్నపన తిరుమంజన సేవ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన వంటి కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను కల్యాణ మండపంలోకి వేంచేపు చేశారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలు, పరిమళ భరిత పుష్పాలతో స్నపన తిరుమంజన సేవను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు జరిగిన స్నపన తిరుమంజనం సేవ భక్తులకు కన్నులపండువైంది. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు,పసుపు, చందనం అభిషేకించారు. అలాగే సాయంత్రం 5 నుండి 6.30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఆలయ మాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఆలయ యాగశాలలో సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్రాల ప్రతిష్ఠ చేశారు. ఏడాది పాటు ఆలయంలో స్వామి వారికి జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాలలో తెలియక జరిగే తప్పిదాలకు ప్రాయశ్చిత్తం కోరుతూ ఆలయంలో మూలమూర్తి నుంచి పరివార దేవతలు, ధ్వజస్తంభంకు పవిత్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఆలయంలో జరిగే పవిత్రోత్సవాలకు ఆలయం అధికారులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఓటరు జాబితా విషయంలో అప్రమత్తంగా ఉండాలి: టీడీపీ

విశాలాంధ్ర - పాకాల : ఓటరు జాబితా విషయంలో టీడీపీ నాయ కులు అప్ర మత్తంగా ఉండాలని చంద్రగిరి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని తన యుడు పులివర్తి వినీల్ తెలిపారు. ఆదివారం పాకాల మండలంలోని పది పట్ల బైలు , పేరసానిపల్లి గ్రామపంచాయతీలలో వినీల్ ఆధ్వర్యంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తెలుగు యువతతో పులివర్తి వినీల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలన పట్ల ప్రజలు విసిగిపోయి ఉన్నారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ అధికారం చేపట్టడం ఖాయమని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగురవేసేలా తెలుగు యువత కసిగా పని చేయాలన్నారు. ప్రజా వ్యతిరేకతను గుర్తించిన అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లతో గెలవాలనే ఉద్దేశంతో ఓటర్ జాబితా విషయంలో అనేక అవకతవకలకు పాల్పడు తున్నారని దీనిపై టిడిపి నాయకులు ముఖ్యంగా తెలుగు యువత అప్రమత్తంగా ఉండా లన్నారు. ఎప్పటికప్పుడు ఓటర్ జాబితా ను పరిశీలిస్తూ టిడిపి సానుభూతిపరుల ఓట్లు లిస్టులో ఉన్నాయో లేదో చూసుకోవాలని,దొంగ ఓట్లు నమోదయి ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. టిడిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్న నేపథ్యంలో యువత జాగ్రత్తగా ఉండాలని,టిడిపి కుటుంబ సభ్యులకు తమ కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీ నిర్వహించే కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ టిడిపి ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్తు అని ప్రజల భవిష్యత్తుకు టిడిపి గ్యారెంటీ అనే విషయాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు ,తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గడపగడపకు మహా పాదయాత్రను విజయవంతం చేద్దాం: వైస్ ఎంపిపి

విశాలాంధ్ర -రామచంద్రాపురం : చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సోమవారం నుంచి మండలంలో చేపట్టిన గడప గడపకు మహా పాదయాత్రను విజయవంతం చేయాలని వైస్ ఎంపిపి ఆర్ లావణ్య చంద్రబాబు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందు ఉదయం 9 గంటలకు పుల్లమనాయుడు కండ్రిగ పంచాయతీ లోని బి సి కాలనీలో వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం చంద్రన్న నాయుడు కండ్రిగ, పుల్లమనాయుడుకండ్రిగ, పిల్లారి కోన, ఎస్టీ కాలనీ,రెడ్డి ఇండ్లు, నెత్తకుప్పం ఆది ఆంధ్ర వాడల్లో పర్యటించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుని అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని అధికారులను ఆదేశిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, మండల పరిశీ లకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్ ,డివిజనల్ అధ్యక్షులు, పంచాయతీ కన్వీనర్లు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు కోరారు.

శ్రీనివాస సేతు సెగ్మెంట్ పై రోడ్డు సిద్ధం చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరం తిరుపతి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న శ్రీనివాస సేతు తుది దశ పనులను ఆదివారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామికి సూచనలు చేస్తూ మూడవ సెగ్మెంట్ ను ఆదివారం పెట్టడంతో శ్రీనివాస సేతుపై పూర్తి స్థాయిలో సెగ్మెంట్లు ఏర్పాటు పూర్తి అయినట్లేనని చెబుతూ, ఆ తరువత వారంలోపు స్ట్రేషింగ్ పనులు పూర్తి చేసి ఆ తరువాత తారు రోడ్డు పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.ఈ మోహన్ కి కమిషనర్ సూచనలు చేస్తూ శ్రీనివాస సేతు తుది దశ పనులు పూర్తి అయ్యేంత వరకు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, వచ్చే నెల 18లోపు ఈ పనులు పూర్తి చేసి మొత్తం శ్రీనివాస సేతు ప్రాజెక్టుని 18వ తేది ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అందించడం జరుగుతుందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. కమిషనర్ వెంట ఎస్.ఇ మోహన్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి..

- బస్సు యాత్ర ముగింపు బహిరంగ
- సభను జయప్రదం చేయండి
- సీపీఐ నాయకుల పిలుపు

విశాలాంధ్ర - గూడూరు : మతోన్మాద పాలకుల నుండి దేశాన్ని, అవినీతి పాలకుల నుండి రాష్ట్రాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియో జక వర్గ కార్యదర్శి జీ. శశికుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యా లయంలో నియోజకవర్గ స్థాయి సమితి సమావేశం సీనియర్ నాయకులు సీతా భాస్కర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు అధికమయ్యా యన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నం టుతున్నా రన్నారు. దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. మరోవైపు ఒక పథకం ప్రకారం దేశంలో మత విద్వేషాలను పెంచుతూ అలజడి సృష్టిస్తోం దన్నారు. దీనికి మణిపూర్ హింసాకాండ ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. మతోన్మాద పార్టీల నుండి ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. దశల వారీ మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన జగన్ మద్యం ధరలను మూడింతలు పెంచేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శించుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. సెప్టెంబర్ 8వ తేదీన యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభకు గూడూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, జిల్లా సమితి సభ్యులు సీవీఆర్. కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి జి. రమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కే. నారాయణ, ఎంబేటి చంద్రయ్య, ఏఐవైఎఫ్ నాయకులు చల్లా వెంకటేశ్వ ర్లు, సీనియర్ నాయకులు సీతా భాస్కర్, గౌస్ బాషా, యాకోబ్, సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల జీవితాల్లో వెలుగు

విశాలాంధ్ర-తొట్టంబేడు: టీడీ పీ తోనే పేదల అభివృద్ధి సాధ్య మని ఆ పార్టీ నేతలు చెప్పారు. తొట్టంబేడు మండలం పెద్దకన్న లి, బసవయ్య పాళెం గ్రామాల్లో ఆదివారం 'మహా శక్తి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు టీడీపీ నేతలకు ఘనస్వాగతం పలికారు. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తా మన్నారు. ఆడబిడ్డ నిధి కింద ఇంట్లో ఉన్న ఆడపిల్లలందరికీ ఏడాదికి రూ.15వేలు వంతున ఆర్థిక సాయం చేస్తామన్నారు. 18-59 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు నెలకు రూ.1,500 వంతున ఇస్తామన్నారు. రైతులకు వ్యవసాయ ఖర్చుల కోసం ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. బీసీలకు ప్రత్యేక రోణ చట్టం కల్పిస్తామన్నారు. అందుకే వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీ ని గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గాలి మురళీ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, క్లస్టర్ ఇంచార్జి మునిరాజా నాయుడు, ప్రతాప్ రెడ్డి, జయచంద్ర నాయుడు, వెంకట సుబ్బయ్య, కమల్ కుమార్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రేణుకమ్మ, రమణమ్మ, శ్రీలక్ష్మి, బాలాజీ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర -వరదయ్యపాలెం: వరదయ్య పాలెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్ర మాలు, చిన్నపాండూరు ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవానికి రావా లని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆహ్వా నిం చారు. సత్యవేడు నియోజక వర్గం వరద య్యపాలెం మండలం లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారం భోత్సవం కు రాష్ట్ర అటవీ,విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా ౦డ్డిని వరదయ్యపాళ్యం వైసీపీ నేతలు ఆహ్వా నిం చారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం సూచనల మేరకు వరదయ్య పాళ్యం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు , ఎంపీపీ భర్త దామోదర రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్..నాయుడు దయాకర రెడ్డి, బుచ్చినాయుడు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రా రెడ్డి, రాచర్ల ఎంపీటీసీ భర్త సామర్ల హరి , నియోజక వర్గ సేవాదళ్ కన్వీనర్ శివ యాదవ్ లు తిరుపతి లోని మంత్రి పెద్దిరెడ్డి స్వగృహంకు వెళ్లి ఇందిరానగర్ గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రం, జూనియర్ కళాశాల, ప్రభుత్వ కార్యాలయాలకు నూతన ప్రహరీ గోడ, చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవాలకు ఆహ్వానిం చారు. స్పందించిన మంత్రి వారం పదిరోజుల్లో స్థానిక ఎమ్మెల్యే ద్వారా డేట్ కన్ఫర్మ్ చేస్తానని మంత్రి తెలిపినట్లు నాయకులు తెలిపారు.

మార్కెట్ లోకి 'హీరో న్యూ గ్లామర్'

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ద్విచక్ర వాహనాల్లో రారా జుగా పేరుగాంచిన 'హీరో' పరిశ్రమ వారు మార్కెట్ లోకి మరో కొత్త మోడల్ ను తీసుకువచ్చింది. దీనికి 'హీరో న్యూ గ్లామర్' గా నామకరణం చేశారు. హీరో న్యూ గ్లామర్ ను ఇటీవల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ... నూతన సాంకేతిక పరిజ్ఞానంతో హీరో న్యూ గ్లామర్ తయారు చేశామన్నారు. అనేక కొత్త ఫీచర్లు ఈ వాహనంలో ఉన్నాయని వారు చెప్పారు. వాహన చోదకులకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుదన్నారు. వినియోగ దారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని పరిశ్రమ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో హీరో షోరూం యజమాని కె.ప్రసాద్ రెడ్డి, మేనేజరు ఎన్. వేణుగోపాల్ రెడ్డి, శరవణ ఆటోమొబైల్స్ సిబ్బంది, స్థానిక మెకానిక్ లు పాల్గొన్నారు.

టిటిడి పాలకమండలి ఎంపికలో పేద వర్గాలు కనపడలేదా?

- లిక్కర్ స్కాం నిందితులను పాలకమండలి సభ్యుల పదవి నుంచి తొలగించాలి
- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత కోటా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : టీటీడీ పాలక మండలి సభ్యుల ఎంపిక పై జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి వినుత కోటా అభ్యంతరం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ పదవికి ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు తప్ప మిగిలిన పేద వర్గాలు కనపడలేదు అని వాపోయారు. ప్రతి మీటింగులో నా ఎస్సీ లు , నా ఎస్టీ లు, నా బీసీ లు అని ఊదరగొట్టే ముఖ్యమంత్రి జగన్ టీటీడీ చైర్మన్ పదవిలో ఆ వర్గాలు కనపడలేదా అని మండిపడ్డారు. గత ప్రభుత్వాలను టీటీడీ పాలక మండలి ఎంపికలో ఇతర రాష్ట్రాలకి చెందిన వారికి ఇవ్వడాన్ని విమర్శించిన జగన్ కి ఇప్పుడు తన ప్రభుత్వ ఎంపికలో గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. చెప్పేవి ఒక్కటి చేసేవి మరొకటి గా జగన్ వ్యవహారం ఉందన్నారు. లిక్కర్ స్కాం లో ఉన్న శరత్ చంద్ర రెడ్డి, ఆర్థిక నేరస్తుడు, కేతన్ దేశాయ్ టీటీడీ పాలక మండలిలో పెట్టి తిరుమల ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారని, తిరుమల శ్రీవారి ప్రతిష్ట తో ఆడుకున్న వారు కనపడకుండా పోయారని గుర్తు చేశారు. వీరికి పదవి కట్టబెట్టడంలో వారి స్కాంలో మీకు కూడా పాత్ర ఉందనే అనుమానం ప్రజలకు వస్తుందని తెలిపారు. వెంటనే పాలక మండలిలో నియమించిన లిక్కర్ స్కాం నిందితుడు, ఆర్థిక నేరగాళ్లకు తొలగించాలని డిమాండ్ చేశారు.

దేశ నిర్మాతలు గురువులు- మిషన్ 2047 పై కార్యశాల

విశాలాంధ్ర - తిరుపతి : దేశం స్వాతంత్రయం సిద్ధించి 2047 సం ఎం కు100 వసంతాలను నింపుకోనున్న ఈ 24 సంవత్సరాల సమయంలో 2047 నాటికి స్వాతంత్ర దేశ నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర ఏమిటి? ఎలా ఉండాలి? అనే ఉద్దేశంతో "టీచర్స్ యాజ్ నేషనల్ బిల్డర్స్ - మిషన్ 2047" పైన వివేకానంద కేంద్ర, కన్యాకుమారి వారి తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ లోని ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ డిపార్ట్మెంట్ సెమినార్ హాల్ నందు తిరుపతి ప్రాంత డిగ్రీ మరియు విశ్వవిద్యాలయాల అధ్యాపకులకు కార్యశాల నిర్వహించారు. తిరుపతి చాప్టర్ ప్రముఖ్ డాక్టర్ హరికృష్ణ పాకనాటి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయుర్వేదిక్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ గారు, తెలుగు ప్రాంత సహ ప్రముఖ్ మారుతి మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ యువ విద్యార్థులకు విషయ బోధనతోపాటు క్రమశిక్షణ జీవితం, నైతిక బాధ్యత, సామాజిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ పరిజ్ఞానం, వ్యాపార పరిజ్ఞానం, ప్రాథమిక హక్కుల విషయ పరిజ్ఞానం, మానవ బంధాలు, క్రీడ పరిజ్ఞానం, ఆరోగ్య మరియు మానసిక ఆరోగ్య పరిజ్ఞానం, పర్యావరణ పరిజ్ఞానం పై అవగాహన కలిగించాలని కోరారు. వీటికి తల్లిదండ్రుల సహకారం ఉండాలని, దీనికి నెలకు ఒకసారి వారి తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలి అన్నారు. అదేవిధంగా సమాజంలో ప్రజలు, ప్రభుత్వం గురువులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గురువుల నుంచి తయారయ్యే అధికారులు డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు మొదలగు వారికి సంఘం ఇచ్చే గౌరవం, ప్రభుత్వం కల్పించే ఆర్థిక సౌకర్యాలు గురువులకు లభించడం లేదని, ఈ విధానం దేశాభివృద్ధికి గొడ్డలి పెట్టు లాంటిదని, దీనిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు ప్రజలపై ఉన్నది అని తెలియజేశారు.ఇవే కాకుండా దేశ అభివృద్ధికి అధ్యాపకులు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాలపై కూడా శిక్షణ ఇచ్చారు.యువ విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించి, సొంత సంస్థలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయడం.వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొం దించి వ్యవసాయ ఉత్పత్తులు, వాటి మార్కెటింగ్ పరిజ్ఞానాన్ని పెంచేందుకు కృషి చేయడం. విద్యార్థిని విద్యార్థులు సాహస యాత్రలు, కార్యక్రమాలు నిర్వహిం చేందుకు కృషి చేయాలి. తద్వారా దేశభక్తిని పెంపొందిం చడం. విశ్వవిద్యా లయాలలో, కళాశాలలోను అన్ని మతాల, ప్రాంతాల పండుగలను నిర్వహించి సమానత్వాన్ని పెంపొందించడం. విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా శిక్షణ, పోటీలలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ఆచార్య మాధవ నాయుడు, డా. విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర -నారాయణవనం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం తలపెట్టిన నగరి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీ పురం మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి సీఎం జగనన్న నగరి కార్యక్రమానికి జన సమీకరణ పై పార్టీ శ్రేణులకు దిశనిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి సభకు ప్రజలు భారీగా తరలి వెళ్లేలా ఏర్పాటు చేయాలని పార్టీ నేతలకు ఆయన సూచించారు. అనంతరం జగనన్న విద్యా దీవెన మూడో విడత నిధులను సిఎం జగన్ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. చిత్తూరు జిల్లా నగరిలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఐటిఐ, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులు చదివే విద్యార్థుల తల్లుల ఖాతా ల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయనుంది. దాదాపు 9.80 లక్షల మందికి లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామ్ కుమార్ రెడ్డిని కలిసిన వైసిపి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర- సత్యవేడు: తిరుపతి జిల్లా వాకాడులో వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు. ఆదివారం సురుటుపల్లి ఆలయ సభ్యులు మునివేలు, సత్యవేడు గ్రామ సచివాలయ కన్వీనర్ పయని, మాస్టర్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షులను కలిశారు. వైసిపి జిల్లా కార్యదర్శిగా తనను నియమించి బాధ్యతలు అప్పగించినందుకు ఈ సందర్భంగా వైసీపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు రామ్‌కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోనూ, జిల్లా స్థాయిలో వైసీపీ బలోపేతానికి పార్టీ శ్రేణుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ రెడ్డిని కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని గెలిపించుకోవాలని జిల్లా అధ్యక్షులు సూచించారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు అందజేత

విశాలాంధ్ర - వరదయ్యపాలెం: సత్యవేడు నియోజకవర్గం వరదయ్య పాలెం మండలంలో క్రియాశీలక సభ్యత్వ కిట్లను మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్ జనసైనికులకి అందించారు. చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తల క్షేమం గురించి ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్ మాత్రమే అని, క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు ప్రమా దంలో గాయపడితే 50 వేలు రూపా యలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శేఖర్, తులసీరామ్, కమిటీ సభ్యులు వెంకటేష్, ప్రసాద్, యుగంధర్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

చిల్లకూరు ఎస్ఐపై సీపీఐ నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర - గూడూరు : సమస్యలపై చిల్లకూరు ఎస్ఐకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు ఆదివారం ఒఖటవ పట్టణంలో గూడూరు రూరల్ సీఐ దశరథరామారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ చిల్లకూరు మండలం తొణుకుమాలలో చల్లా వెంకటేశ్వర్లు అనే రైతు పొలంలో రమేష్ రెడ్డి అనే వ్యక్తి పైపులు ధ్వంసం చేశాడని, సోలార్ సిస్టం అపహరించారని రెండుసార్లు ఫిర్యాదు చేసినా ఎస్ఐ స్పందించలేదన్నారు. పైప్ లైన్ ధ్వంసం, సోలార్ అపహరణతో చెట్లు ఎండిపోతున్నాయని సీఐ దృష్టికి తీసుకువచ్చారు. రైతు చల్లా వెంకటేశ్వర్లుకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన సీఐ రమేష్ రెడ్డిని పిలిపించి మాట్లాడుతామన్నారు. చల్లా వెంకటేశ్వర్లుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఐని కలిసిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, సీనియర్ నాయకులు సీతా భాస్కర్, ఏఐటీయూసీ నాయకులు ఎంబేటి చంద్రయ్య, నారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వైసీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గా అన్నం మురళీ

విశాలాంధ్ర - గూడూరు : తిరుపతి జిల్లా పార్లమెంటు ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గా వైసీపీ నాయకులు అన్నం మురళి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మురళికి వైసీపీ నాయకులు, స్నేహితులు, సన్నిహితులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కష్టపడి పనిచేసి రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైసీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తుంటి సుధాయాదవ్ అభినందనలు

విశాలాంధ్ర- రామచంద్రాపురం: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన యులు చెవిరెడ్డి మో హిత్‌రెడ్డి తుడా చైర్మన్ గా పదవీ బాధ్య తలు నిరాడంబరంగా స్వీక రణ అనంతరం టీటీ డీ ధర్మకర్తల మండలి నలుగురు అఫీషియో సభ్యులతో పాటు ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తల్లి దండ్రులు చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తల్లి చెవిరెడ్డి లక్ష్మి తమ్ముడు హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు తుంటి సుధాయాదవ్ మోహిత్ రెడ్డిని దశ్శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందించి శ్రీవారి చిత్ర పటాన్ని అందజేశారు భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలని రాష్ట్ర రాజకీ యాల్లో మకుటం లేని మహారాజులా వెలిగి ప్రజాసేవ చేయాలని కోరుతూ అభినందించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి నా క్లయింట్ గాజులపల్లి వెంకటసుబ్బారెడ్డి తండ్రి గాజులపల్లి వెంకట సుబ్బారెడ్డి బోవిశ్వవారిపల్లె గ్రామం, బద్వేలు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా వారి తరపున తెలియజేయడం ఏమనగా!

నా కక్షిదారుడు క్రింద కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని చిత్తూరు జిల్లా, రొంపిచెర్ల మండలం, మోటుమల్లెల పోస్టు, బి.చల్లావారిపల్లి గ్రామంలో కాపురముండు కలికిరి సిద్ధారెడ్డి గారి కుమారుడు కె.విశ్వనాథ రెడ్డి గారి వద్ద నుండి విక్రయించు కొనుటకు అంగీకారము పొందినారు. కావున షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించి ఎటువంటి క్లెయిమ్‌లు, అప్పులు, కోర్టు వ్యవహారములు, విక్రయ అగ్రిమెంట్స్ మొదలగు నవి ఉన్న యెడల క్రింద కనిన అడ్రస్సుకు 7 రోజుల లోగా తెలుపగలరు. తరువాత వచ్చు అభ్యంతర ములకు నా కక్షిదారులు బాధ్యులు కారు.

షెడ్యూలు: చిత్తూరు డి., శ్రీ బాలాజీ రి.డి., తిరుపతి, చంద్రగిరి సబ్-డి., తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ పంచాయతీకి చేరిన నెం.55 రు పుదిపట్ల గ్రామ లెక్కదాఖలా సర్వే నెం.95/2, 98/1,2, 102/3, 106/3,4, 109/3, 110 ర్లలో విస్తీర్ణం ఎ. 12.58 సెంట్లు గల భూమిని తుడా తిరుపతి వారిచే యల్.పి.నెం.20 / 81 / 1997, తేది. 08.05.1997 రుగా అప్రూవల్ కాబడి నవ చైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు "సాయినిధి" అను పేరిట వేసియుండు ప్లాట్లలో ప్లాటు నెం.127రు గల జాగాకు హద్దులు, కొలతలు వివరం **తూర్పు:** 33' అడుగులు వెడల్పు గల రోడ్డు, **పడమర:** లలితమ్మ గారి ప్లాటు నెం.102 రు గల జాగా, **ఉత్తరం:** రాజేశ్వరి గారి ప్లాటు నెం.126 ర్లు గల జాగాలు, **దక్షిణం:** 40 అడుగులు వెడల్పు గల రోడ్డు, పై హద్దుల మధ్య గల తూర్పు - పడమర ఇరువైపుల అడుగులు 53'కు 16.165 మీటర్లున్నూ, ఉత్తర - దక్షిణం ఇరువైపుల అడుగులు 38'6"కు 11.773 మీటర్లున్నూ, ఇందుకు సరియగు 2045.8 చ॥అ॥ మూర్తు 227.31 చ॥గ॥లు లేక 56.82 అంకణములు

కటారి మహేష్, అడ్వకేట్
డి.నెం.19-12-351, బైరాగిపట్టెడ, తిరుపతి
సెల్: 9652405240

హైస్కూళ్లకు అనుబంధంగా కళాశాల (2) విద్యా బోధన

- పేద విద్యార్థులకు ఉచిత విద్య లక్ష్యంగా హైస్కూళ్లకు అనుబంధ చదువులు
- నాడు- నేడుతో రూపు రేఖలు మారిన సర్కారు బడులు
- మహిళ సాధికారికతగా ఆడపిల్లల చదువుల కొనసాగింపునకు సదావకాశాలు
- ఉచిత విద్య, వసతి సౌకర్యాలతో బాల్య వివాహాలకు దూరం

విశాలాంధ్ర -నాయుడుపేట: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంతో పాటు, విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి పెను మార్పులు తీసుకు వస్తోంది. పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించి ఉపాధి రంగంలో రాణించే విధంగా తీర్చిదిద్ది, బాల్య వివా హాలకు దూరంగా ఉండాలని కార్పొరేట్ కళాశాల విద్యకు మిన్నగా అర్హత కలిగిన ఉపాధ్యాయుల వద్ద బోధన అంది స్తున్నారు. ప్రాథమిక స్థాయి నుండే ఆంగ్ల మాధ్యమంలో బోధన జరిగేందుకు శ్రీకారం చుట్టారు. అంతే కాకుండా "నాడు-నేడు' పథకం ద్వారా నిధులు కేటాయించి పాడుబడిన బడులను అన్ని హంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అంతే కాకుండా ప్రాథమిక విద్య పూర్తయిన విద్యార్థినులకు హైస్కూల్‌లకు అను బంధంగా -2 కళాశాల విద్యను పొందే దిశగా అనుబంధ కళాశాలలను ప్రారంభించి కార్పొరేట్ కళాశాలలో సీటు పొంది

ఫీజులు చెల్లించే ఆర్థిక భారాన్ని తొలగించారు. ఈ క్రమంలోనే 2023 ఏడాదికి నాయుడుపేట బాలుర హై స్కూల్, ఓజిలి, అరవపాలెం, సూళ్లూరుపేట హై స్కూళ్లలో బాలికల కళాశాల విద్యను ప్రారంభించారు. అయితే ఓజిలి,అరవపాలెం, సూళ్లూరు పేట ఉన్నత పాఠశాలల కన్నా నాయుడుపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది ప్రారంభమైన -2 కళాశాల విద్య చక్కగా కొనసాగుతోంది. అక్కడ పని చేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయే షన్ టీచర్స్ సిబ్బంది వారి వంతుగా సిఇసి గ్రూప్ 32, ఎంపీసీ 16 మంది విద్యార్థులను చేర్పించి విద్యా బోధన కొనసాగి స్తున్నారు. హై స్కూల్ బోధన సిబ్బందిగా 24మంది హెచ్‌ఎం వేమ సుధాకర్ పనిచేస్తున్నారు. 8 మంది ఉపాధ్యా యులను కళాశాల విద్యను బోధించేందుకు హడ్ హక్ పద్ధతిలో అన్ని విద్యార్హతలు ఉన్న వారికి పీజీ టీలుగా ప్రభుత్వం నియా మకం చేసినట్లు సమాచారం. పిజిటిల కృషి ఫలితంగా ఈ విద్యా సంవత్సరం అత్యధికం గా విద్యార్థులను ఈ హైస్కూల్ ప్లస్‌లో చేర్పించారు. అధిక శాతం నిరుపేద విద్యార్థినిలే ఈ ఏడాది అడ్మిషన్ పొందడంతో వారికి భోజన, నివాస వసతి సౌకర్యా లను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఏర్పాటు చేశారని విద్యా బోధకు లు చెబుతున్నారు. విద్యా బోధనకై రెండు తరగతి గదుల్లో క్లాసులు నిర్వహిస్తున్నారు. మరో ఐదు తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. అక్కడ ఉన్నత పాఠశాల ప్రాంగణం, పరిసరా లు నీడనిచ్చే ఏపుగా పెరిగిన వృక్షాలతో, సైకిల్ స్టాండ్, హ్యాండ్ వాష్ నీటి సౌకర్యం, కుళాయిలు, సాంస్కృతిక కార్యక్ర మాలకు అందమైన కళావేదిక నిర్మాణం కూడా ఆవరణలో ఉంది. కార్పొరేట్ కళాశాల బోధనతో పోల్చుకుంటే సర్కారు బడు ల్లోని విద్యకు పొంతన చూస్తే , నక్కకు నాగలోకానికి ఉన్నంత దూరంగా ఉందనే చెప్పవచ్చు. జీవో 124 ప్రకారం ఈ హెచ్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఏది ఏమైనా ఈ బాలుర ఉన్నత పాఠశాలలో ఎందరో విద్యాభ్యాసం సాగించి ఉన్నత పదవుల్లో, విదేశాల్లోనూ, రాజకీయ నేతలు గాను ఎదిగి ఆర్థిక అభివృద్ధి చెందిన వారు ఎందరో ఉన్నారు. ఇలాంటి పాఠశాలలో అనుబంధ కళాశాల విద్యపై అమలు

చేస్తున్న పలు గ్రూపుల్లో విద్యార్థులను చేర్పించి తల్లిదండ్రులు ఆర్థిక భారం తగ్గించుకునే అవకాశం ఉంటుంది. జిల్లా విద్యా శాఖ అధికారులు కూడా నేడు ఉపాధి రంగానికి అవసరమైన గ్రూపు లను ఏర్పాటు చేయగలిగితే భవిష్యత్తులో కార్పొరేట్ కళా శాల కన్నా అత్యధికంగా విద్యార్థులు చేరే అవకాశం మెండుగా ఉం టుంది. విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్న మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను ఆచరణ సాధ్యంలో అమలు కావడానికి అక్కడి పని చేస్తున్న సిబ్బంది కృషి ఎంతైనా ఉంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిజిటిల కృషిని తల్లిదండ్రులు కొనియాడారు.